క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారా రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాద్రపదమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయ, వినయ్, చెరుకూరి రాంబాబు పూజలు చేశారు. పూజలు అనంతరం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వరద బాధితుల కోసం రాక్ సాయం



రాజుపాలెంలో వరద బాధితులకు సరకులు తీసుకు వెళుతున్న రాక్ సిరామిక్ ప్రతినిధులు

సామర్లకోట: ఏలేరు ప్రాజెక్టు వరద నీరు కారణంగా తీవ్రంగా నష్టపోయిన కిర్లంపూడి మండలం రాజుపాలెంలో బాధితులను ఆదుకోవడానికి తమ వంతు బాధ్యతగా రాక్ సిరామిక్స్ యాజమాన్యం ముందుకు వచ్చింది. వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను శనివారం సాయంత్రం రాజుపాలెం తరలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ టి.నిరజ్‌కుమార్, టైల్స్‌ప్లాంటు హెడ్ వినోద పైక వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్లదురై, జనరల్ మేనేజరు సప్లయ్ రాజిందర్‌సింగ్ మాన్, చీఫ్ కౌన్సిల్ ఐఆర్‌అండ్ పీఆర్ డాక్టరు శేషగిరిరావు, సేఫ్టీ మేనేజరు బాలాజీ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజరు వీజీఎస్ కుమార్ పాల్గొని నిత్యావసరాలను పంపిణీ చేశారు. అలాగే వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తమ వంతు సాయం అందించామన్నారు.

పేదలకు దుస్తులు, నిత్యావసర సరకుల పంపిణీ



సామర్లకోటలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ గుర్తించిన పేదలకు శనివారం నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఆకలితో ఉంటున్న నిరుపేదల కోసం పట్టణ ప్రజల నుంచి సేకరించిన దుస్తులు, బియ్యం, కందిపప్పు, చింతపండు, పంచదార, నూనెలను రాజమహేంద్రవరం మెప్మా సిటీ మిషన్ మేనేజరు రవిశంకర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 110 మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేసిన కార్యక్రమంలో పట్టణ మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, సీఓలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు ఇన్నకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయనున్నట్టు తెలిపారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్తపల్లి, వాక తిప్ప, కుతుకుడుల్లి, ఉప్పాడ గ్రామాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

150 మందికి కంటి పరీక్షలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ వైస్ గవర్నర్ సుబ్బరాజు ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు 150 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు.

అజొల్లాతో అనేక ప్రయోజనాలు

- పంటలకు ఎరువుగా.. పశువులకు దాణాగా..
- రైతులకు ఎంతో ఉపయోగం
- రిలయన్స్ ఆధ్వర్యంలో 18 మండలాల్లో అజొల్లా సాగు



పెద్దాపురం: ప్రస్తుత రోజుల్లో పచ్చి, ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. వ్యవసాయంలో యంత్రాలు, రసాయనాలు వినియోగించడంతో పచ్చి, ఎండుగడ్డి కనిపించకుండా పోతోంది. కూలీల కొరత, కూలి రేట్లు పెరగడం వంటి వాటి వల్ల రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. సాగులో కలుపు పెరగకుండా రసాయనాలు వాడుతున్నారు. వీటి వల్ల పశువులకు దాణా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులకు 'అజొల్లా' ఒక వరంలా మారింది. పెరిగిన దాణా ఖర్చులు కూడా పశుపోషణకి కష్టంగా మారిన సమయంలో అజొల్లా వల్ల ఉపయోగాలు తెలపడానికి, పాడి పంటలకు అజొల్లా ఆవశ్యతనను తెలుపుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలా పరిధిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులు ఈ అజొల్లా తయారు చేసి, పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

విస్తృతంగా ప్రచారం

వ్యవసాయంలోనూ, పశువులు, కోళ్ల పెంపకంలో 'అజొల్లా' రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది. నాచు జాతికి చెందిన అజొల్లా ఇంటి ఆవరణలోనే సులభంగా పెంచుకోవచ్చు. పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్), రిలయన్స్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో అజొల్లా తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. పెద్దాపురం మండలం జి.రాగంపేట, గోరింట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, ఐనవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ, అడ్డతీగల, రాజ ఒమ్మంగి, రంపచోడవరం మండలాల్లో అజొల్లా గురించి ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

అజొల్లా తయారీ ఇలా

అజొల్లా పెంపకానికి కావాల్సిందల్లా కొన్ని సిమెంటు లేదా మామూలు ఇటుకలు, ఓ టార్పాలిన్ పట్టా, తాగునీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా. ఈ మొత్తం కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ.1000 మాత్రమే. సిమెంట్ ఒరలు కానీ, ఇటుకలతో తయారు చేసుకున్న తొట్టెల్లో అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెసుకొచ్చి, తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.

లాభాలు

- అజొల్లాను ఇంటి వద్దే పెంచుకోవచ్చు. పెంపకం కూడా సులువే.
- ఆవులకు, గేదెలకు, మేకలు, కోళ్లతోపాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతి రోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పెడితే పాల దిగుబడి పెరుగుతుంది. ఆ పాలల్లో వెన్న శాతం పెరుగుతుంది. ప్రొటీన్స్, మాంసకృత్తులు అధికంగా లభిస్తాయి. పశువుల సమయానికి ఎదకి వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.



కోళ్లకు మేతగా వేసిన అజొల్లా

- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో జల్లు కోవడం వల్ల ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను పొలంలో వేయడం వల్ల మొక్క వేర్లకు ఆక్సిజన్ తగినంత అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- పొలం నిండా అజొల్లా ఉండడం వల్ల నీరు త్వరగా ఆవిరి కాదు. ఫలితంగా నీటి తడులు అందించాల్సిన అవసరం చాలా తగ్గుతుంది.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.

పంటకే కాదు.. పశువులకూ మేలే



అజొల్లా వేసిన 15 రోజుల నుంచి రోజూ ఒక కేజీ వంతున పాడి పశువులకు దాణాగా వినియోగిస్తున్నాను. పాల దిగుబడే కాకుండా వెన్న శాతం కూడా పెరిగింది. వరి పంటలో కూడా అజొల్లా వేశాను. దీనివల్ల కలుపు నివారణకు దోహదపండి. యూరియాకు బదులుగా అజొల్లాను ఉపయోగించా. ఎకరాకు రూ.5 వేల నుంచి 6 వేలు రూపాయల ఖర్చు తగ్గింది.

– కన్నారావు, అజొల్ల సాగు రైతు, జి.రాగంపేట, పెద్దాపురం మండలం

అవగాహన కల్పిస్తున్నాం



అజొల్లా ప్రతీ రైతు ఇంట్లో పెంచుకోవాలి. దీని వల్ల రైతులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం అవసం ఉండదు కానీ కాస్త శ్రద్ధ తీసుకోవాలి. అజొల్లా పెంపకంపై 18 మండలాల్లోని రైతులకు అవగాహన కల్పించాం. సాగుకు రైతులకు సలహాలు అందిస్తున్నాం. కేవలం రూ.వెయ్యి పెట్టుబడితో నిరంతరం అజొల్లా తయారవుతుంది. రైతులు కూడా అజొల్లాపై ఆకర్షితులవుతున్నారు.

– బర్రె నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ పౌండేషన్, గోరింట, పెద్దాపురం మండలం

గణపతికి విశేష పూజలు



వాకతిప్పలో గణపతి మందిరం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవ రాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుతూ గరిక పూజలు చేశారు. రాత్రికి వాకతిప్పలో గణపతి మందిరం వద్ద దీపాలంకరణ సేవ నిర్వహించారు.

దత్త స్వాముల గ్రామోత్సవం



పిఠాపురంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దత్త స్వాములు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభస్వామి వారి సప్తాహ మహోత్సవాల సందర్భంగా దత్త దీక్షలు తీసుకున్న స్వాములు శనివారం పిఠాపురంలో గ్రామోత్సవం నిర్వహించారు. గత ఏడు రోజులుగా దీక్ష చేసిన దత్త స్వాములు ఇరుముడులు శిరస్సున ధరించి శ్రీపాద శ్రీవల్లభ భావనాచార్యుల ఆలయం నుంచి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీపాద శ్రీవల్లభమహా సంస్థానంలో దీక్షలు విరమించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు దొరబాబు పరామర్శ



సామర్లకోటలో నమ్మి శ్రీనివాసును పరామర్శించిన దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులను ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి వాసు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దొరబాబు ఆయనను పరామర్శించారు. అదే విధంగా 25వ వార్డు కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ తండ్రి ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకోవడంతో ఆయనను కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు నమ్మి సూర్యదుర్గ సేపెని సురేష్, జట్ల మోహన్, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, పెండ్యాల అబ్బు, కర్నీడి జలంధర్, బండారు వీరబాబు, పుట్టా సూరిబాబు, చిట్టుమాని శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాలు ప్రశాంతంగా జరగాలి

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి శిబిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని శనివారం జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన గణపతి స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఉంటుందని ఆటో యూనియన్ అధ్యక్షుడు డి సోమేశ్వరరావు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజా సూరిబాబురాజు, గోలి దొరబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కర్రి వెంకటరమణ, బస్వా శేషు, వల్లూరి గాంధీ, సరోజ్ వాసు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉండూరు, వేట్లపాలెం గ్రామాల్లోని గణపతి శిబిరాల్లో స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

శృంగార వల్లభుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శంగారవల్లభ స్వామి



స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

ఆలయ ఆదాయం
శనివారం ఒక్కరోజు రూ.1.86 లక్షలు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,86,843 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు ఎనిమిది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 3500 మంది భక్తులకు ప్రసాద వితరణ అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మోక్షగుండంకు చదరంతో నివాళి

47	33	44	39
43	40	46	34
37	42	35	49
36	48	38	41

ఏ నాలుగు అంకెలు కూడినా 163 వచ్చే మ్యాజిక్ చదరం



తోటకూర సాయివంశీ

సామర్లకోట: భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థి ఆయనకు నివాళి తెలిపేలా మ్యాజిక్ చదరం తయారు చేశాడు. సామర్లకోటకు చెందిన తోటకూర సాయివంశీ మ్యాజిక్ చదరం తయారు చేశాడు. మోక్షగుండం 163వ జయంతిని పురస్కరించుకొని చదరంలో ఏ నాలుగు అంకెలు కూడినా 163 వచ్చే విధంగా చదరం తయారు చేసి స్థానికులు ఆశ్చర్యంలో ముంచాడు. బెంగళూరులో ఉంటున్న సాయివంశీ గణపతి నవరాత్రఉత్సవాలను పురస్కరించుకొని సామర్లకోట వచ్చాడు.

లోక్ అదాలత్‌లో 237 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో ప్రసంగిస్తున్న జడ్జి చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా 237 కేసులు పరిష్కరించారు. పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. వీటిలో సివిల్ కేసులు 34, క్రిమినల్ కేసులు 40, మోటారు వెహికల్ ప్రమాదపు కేసులు 14, ప్రిలిటిగేషన్ బ్యాంక్ కేసులు ఏడు, 15 ప్రిలిటిగేషన్ బీఎస్ఎన్ఎల్ కేసులు, 127 క్రిమినల్ చలానా కేసులు పరిష్కరించనట్టు జడ్జి చంద్రమౌళీశ్వరి ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆయా కేసుల ద్వారా రూ.02,01,49,303 నగదు లభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి పద్మాసిని, అడిషనల్ జూనియర్ జడ్జి బుల్లెమ్మ, న్యాయవాదులు ఎస్.మురళిశ్రీనివాస్, దీప దైవకృప, ఎన్.దుర్గారావు, పీఎల్వీ నూతలపాటి అప్పలకొండ, కక్షిదారులు పాల్గొన్నారు.

నీటిలో నానుతున్న వరి పొలాలు



వీకే రాయపురంలో చెరువుగా మారిన వరిచేలు



కొత్తపల్లి మండలంలో వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ జోగిరాజు

సామర్లకోట: వరదల కారణంగా వరి పొలాలు గత పది రోజులుగా నీటిలోనే ఉన్నాయి. మండల పరిధిలో సుమారు 2,500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండల పరిధిలో వర్షాలు లేకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో మండలంలో పంట భూములను నీటిలో ముంచి వేశాయి. సామర్లకోట-పిఠాపురం రోడ్డు, పవర, చంద్రంపాలెం, అచ్చంపేట గ్రామాల్లో ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన అదనపు నీరు కారణంగా పంట పొలాలు నీట మునిగిని తీరని తీరని నష్టం జరిగింది. వీకే రాయపురంలో గోదావరి కాలువ నీరు వచ్చి సుమారు 350 ఎకరాలను ముంచేసింది. వేట్లపాలెం గ్రామంలో గోదావరి కాలువ నీరు ఎక్కువగా ఉండడంతో గోదావరి కాలువ గట్టు కోతకు గురి అవుతుందనే సాకుతో తరచూ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్‌ప్లస్ వైర్లు ఎత్తివేస్తున్నారు. దాంతో నీరు వీకే రాయపురం గ్రామానికి చెందిన పంట పొలాలను ముంచేంది. పడుతుంది. పొలాల్లో ఉన్న అదనపు నీరు గ్రామ సమీపంలో ఉన్న తూటేరు డ్రైను మీదుగా సముద్రంలోనికి పోవాలి. అయితే తూటేరు డ్రైను పూర్తిగా పూడిగ, గుర్రపు డెక్కతో నిండి పోవడంతో ఆ నీరు వెనుకకు వచ్చి పోలాల్లోకి వచ్చింది. శనివారం నాటికి కూడా వరి పొలాలు చెరువులుగానే ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

3,550 ఎకరాల్లో పంట నష్టం

కొత్తపల్లి: ఏలేరు వరద కారణంగా మండలంలో 3550 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇసుకపల్లిలో 1060, నాగులపల్లి 1800, రమణక్కపటలో 1040 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు.

ప్రధాన డ్రైనులో పూడిక తొలగింపు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో పూడిక తీత పనులను కమిషనర్‌తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన డ్రైనులో పూడిక తొలగింపు ద్వారా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చేయడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులో పూడిక తీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యతో కలిసి పరిశీలించారు. గాంధీచౌక్ నుంచి ఏలేరు కాలువ వరకు డ్రైనులో పూడిక తీత పనులు జెసీబీతో పూర్తి చేసినట్టు కమిషనర్ తెలిపారు. బస్సు కాంప్లెక్స్ నుంచి గాంధీచౌక్ వరకు ఉన్న ప్రధాన డ్రైనులో పూడిగ తీస్తున్నట్లు చెప్పారు. అయితే గాంధీచౌక్‌లో కల్వర్టు దిగువ భాగంలో పూడిగ తీయకపోతే ఫలితం ఉండదనే సూచనల మేరకు కల్వర్టు దిగువ భాగంలో పూడిక తీయించామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, మున్సిపల్ కాంట్రాక్టరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టిడ్కో ఇళ్లలో ముంపు బాధితులను కలుసుకున్నారు. హుస్సేపురం యువత ఏర్పాటు చేసిన బియ్యం కూరగాయలు, పప్పులు, నూనెలను ఎమ్మెల్యే అందజేశారు.

10 పాయింట్లలో నిమజ్జనానికి అనుమతి



వివిధ శాఖల అధికారులతో గణేశ్ నిమజ్జనాలపై సమీక్ష నిర్వహించిన తహసీల్దార్

సామర్లకోట: పట్టణ, మండల పరిదిలో ఏర్పాటు చేసుకున్న గణేష్ శిబిరాలలో విగ్రహాల నిమజ్జనానికి 10 పాయింట్లు కేటాయించామని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం పట్టణ, మండల పరిధిలో వివిధ శాఖల అధికారులతో నిమజ్జన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సామర్లకోటలో పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద గోదావరి రేవు, జి. మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, మాధవపట్నం గ్రామాల్లో గోదావరి కాలువ రేవుల లోను, చంద్రపాలెం, నవర, పి. వేమవరం, పవర, కాపవరం గ్రామాల్లో విగ్రహాలను ఏలేరు కాలువ, కాకినాడలోని ఎన్టీఆర్ బీచ్‌లలో నిమజ్జనం చేయడానికి అనుమతి ఇచ్చామన్నారు. పట్టణ, మండల పరిధిలో 122 విగ్రహాలు నిమజ్జనానికి సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ వివరించారు. ఆయా నిమజ్జన పాయింట్ల వద్ద వివిధ శాఖల అధికారులను నియమించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, ఎస్సై పీవీ ఆర్ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టరు కెజె రాజశేఖర్, మున్సిపల్ ఎఈ సాగర్, పంచారామ క్షేత్ర సూపరింటెండెంట్ ఈశ్వరరావు, మత్స్యశాఖ అదికారి, కె ప్రకాశరావు, డాక్టర్లు వై శ్రీహిమవతి, సీహెచ్ భవ్యశ్రీ, ట్రాన్సుకో ఎఈలు కృష్ణ, పి. రమేష్ కుమార్, ఎంపీడీఓ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు కాకినాడ రాక



విద్యార్థితో రైల్వే ఎస్సై, కానిస్టేబుల్

సామర్లకోట: తిరుపతి జిల్లా నుంచి ఒక విద్యార్థి ఇంటి నుంచి వచ్చి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. సామర్లకోట రైల్వే పోలీసులు శనివారం మూడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పద స్థితిలో ఉన్న ఒక విద్యార్థిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా తాను తప్పిపోయి వచ్చానని, తన పేరు షేక్ మస్తాన్ అని, తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, మూసాపేట అని, 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపాడు. దాంతో ఆ విద్యార్థిని రైల్వే స్టేషన్‌కు తీసుకు వచ్చి వెంకటగిరి పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే అతడు కనిపించడం లేదని తల్లిదండ్రులు షబిహ, జమీల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన్నట్లు తెలుసుకుని వారికి రైల్వే ఎస్సై బి.లోవరాజు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చిన తరువాత విద్యార్థిని అప్పగిస్తామన్నారు.

చివరికి నష్టమే..!

- ఇంతా ముంపులోనే పంటలు
- కుళ్లుతున్న వరి దుబ్బులు



గొల్లప్రోలులో ఇంకా ముంపులోనే ఉన్న వరి పొలాలు

పిఠాపురం: ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో పిఠాపురం నియోజ కవర్గాన్ని వరద ముంచెత్తింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు, పలు గ్రామాల్లో కాలనీలు నీట మునిగాయి. వరద తగ్గడం, రెండు రోజులుగా వాతావరణం తెరిపివ్వడంతో కాలునీలు తేరుకుంటున్నాయి. కాగా నియోజకవర్గంలోని పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని వేల ఎకరాల్లో పంటలు నీట మునిగి రోజులు గడుస్తున్నాయి. వరద ఉధృతి తగ్గక పోగా ఇంకా నీటిలోనే పంటలు ఉండడంతో పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, సూరంపేట, చిత్రాడ ఈబీసీ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా చెరువులుగానే ఉండడంతో స్థానికులు వరద నీటి మధ్య జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వరద నీటి ప్రవాహం తగ్గినా పంట పొలాల్లో ఉన్న నీరుమాత్రం తగ్గక పోవడం వేల ఎకరాల్లో పంటలు కుళ్లిపోతున్నాయి. వరి పంట కుళ్లిపోతోందని, మరోపక్క వాణిజ్య పంటలు పనికి రాకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. ఏటా వర్షాకాలంలో ఏలేరు, సుద్దగెడ్డ వంటి కాలువలకు పలు చోట్ల గండ్లు పడడంతో వ్యవసాయ భూములన్నీ చెరువులుగా మారుతున్నాయి. గ్రామాల్లోకి సైతం భారీగా వరద నీరు వస్తుండడంతో పలు గ్రామాలు జలమయమవుతున్నాయి. ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.